బండలింగంపల్లి లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ పంపిణీ

దశ, ఎల్లారెడ్డిపేట: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బండలింగంపల్లి గ్రామానికి చెందిన గంగసరపు పెద్ద దేవయ్యకు మంజూరు అయిన లక్ష రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కును గ్రామ సర్పంచ్ బాలరాజు నర్సాగౌడ్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు సిరిసిల్ల శాసనసభ్యులు కేటీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బొడ్డు రాజు, పాలకవర్గ సభ్యులు శ్రీనివాస్, మార్పు దయాకర్ రెడ్డి, గంగసరపు రాము, చంద్రయ్య, ఆకారపు ఆంజయ్య , చంద్రయ్య , ఎస్కే దవల్, షకీర్ ,అబ్బు, దత్తాద్రి, కోయడ తిరుపతి గౌడ్, దేవరాజు , ఆరిఫ్ లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సిఐ కి సన్మానం

దశ, ఎల్లారెడ్డిపేట : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐగా శ్రీనివాస్ విధుల్లో చేరి రెండు సంవత్సరాలు శనివారంతో పూర్తి కావడంతో ఆయనను ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపిటిసి ఒగ్గు బాలరాజు యాదవ్, వార్డు సభ్యులు గంట బాలకృష్ణ గౌడ్, మాజీ వార్డు సభ్యులు పందిళ్ళ శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం నాయకులు గంట వెంకటేష్ గౌడ్ లు ఆయనను ఎక్సైజ్ సిఐ కార్యాలయంలో శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

భిక్షమా రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

❖ మాజీ ఎం యల్ ఎ మల్లయ్య యాదవ్

దశ, నడిగూడెం: మండల పరిధిలోని వల్లాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రణబోతు భిక్షారెడ్డి మృతి బాధాకరమని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్ల మల్లయ్య యాదవ్ అన్నారు. శనివారం రానబోతు బిక్షణారెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఇటీవల మృతి చెందిన షేక్ హస్సేన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఓదార్చిన వారిలో టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, మాజీ పిఎసిఎస్ డైరెక్టర్ ఎంకన్న టిఆర్ఎస్ నాయకులు నూక పొంగు ఈదయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం- అభివృద్ధికి పట్టం కడుతున్నారు

❖ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

దశ యాదగిరిగుట్ట తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఎన్నికలో ముఖ్యమంత్రిపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తూ, సంక్షేమం అభివృద్ధి తెలంగాణ ప్రజలు పట్టం కడుతున్నారని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఈమెరకు శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు కావొచ్చు, అసెంబ్లీ ఎన్నికలు కావొచ్చు, ఎమ్మెల్సీ ఎన్నికలు కావొచ్చు, ఇటీవలి సర్పంచ్ ఎన్నికలు మరియు మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రజలు భారీగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపారని పేర్కొన్నారు. ప్రతి ఓటర్ మహాశయులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము అన్నారు.ఓటమి తప్పదని తెలిసినా యాదగిరిగుట్ట, ఆలేరు మున్సిపల్ లో బీఆర్ఎస్ జెండా ఎగరేస్తుందని ప్రగల్భాలు పలికిన మహేందరన్నా.. ఇప్పుడు తల ఏడ పెట్టుకుంటవ్ అని ఎద్దేవా చేశారు.2020లో ప్రజాతీర్పునకు వ్యతిరేకంగా ఎక్స్ అఫిషియో ఓట్లతో గుట్ట గా చైర్మన్ పీఠాన్ని లాక్కున్న రోజునే నీ పతనానికి బీజం పడింది అన్నారు. కర్మ ఎవరినీ వదిలిపెట్టదు మహేందరన్న..అక్రమంగా లాక్కున్న చైర్మన్ పీఠం నుండి బీఆర్ఎస్ ను ఒక్క స్థానానికి పడేసిండ్రు ప్రజలు...అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ఆలేరు ప్రజలు కాంగ్రెస్ వెంటే ఉన్నారు తెలిపారు. ప్రజల తీర్పునకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే పతనం తప్పదన్న నానుడికి నీ పతనమే మంచి ఉదాహరణ మహేందరన్న అని అన్నారు.ఇకనైనా అహంకారపూరిత మాటలు మానుకో.. లేకపోతే రాజకీయంగా భూస్థాపితం కాక తప్పదని హెచ్చరించారు. గత పదిహేనేళ్లలో రాష్ట్రంలో జరిగిన పరిణామాలను పరిశీలించి, ప్రస్తుత ప్రభుత్వ పాలనపై ప్రజలు విశ్వాసం ఉంచారు. గత పాలకులు చేసిన తప్పులను సరిదిద్దుతూ ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

నిన్నటి మున్సిపల్ ఎన్నికల్లో 90% విజయాలు సాధించడం దీనికి నిదర్శనం.మా ముఖ్యమంత్రి నాయకత్వంలో, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఘన విజయం దిశగా నడిపించారు. యాదాద్రి భువనగిరి ప్రజలు ఇచ్చిన మెజార్టీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. గత ప్రభుత్వాలు చేయలేని పనులను ఈ ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి రూపంలో అమలు చేస్తోంది.ప్రజా సేవకుడిగా నేను ఎప్పుడూ మీ ముందుంటాను.మున్సిపాలిటీల్లోనూ ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేస్తాము. ప్రజలందరికీ రెండు చేతులూ జోడించి నమస్కారం తెలియజేస్తున్న. ముందే మేమే గెలుస్తామని అహంకారపు మాటలు మాట్లాడుతున్న వారికి ప్రజల తీర్పే సమాధానం. గత మున్సిపల్ ఎన్నికల్లో అవినీతి, అక్రమ పద్ధతులతో ప్రజాస్వామ్య పీఠాన్ని అధిరోహించాలని చూసిన మీ ప్రయత్నాలను ఆలేరు ప్రజలు ఎప్పటికీ అంగీకరించరు. ఆలేరు ప్రజల ఆశలు, ఆకాంక్షలు మాతోనే ఉన్నాయి. ఆలేరు సేవకుడిగా, మీ బిడ్డగా నిలబడిన బీర్ల అయిలయ్య ఉన్నంత వరకు మీ పార్టీలకు ఓట్లల్లో డిపాజిట్ రావడం కూడా కష్టమే. నా బలం పదిమంది నాయకులు కాదు —— నా కార్యకర్తల బలం, నా నాయకత్వం మీద ప్రజల విశ్వాసం, మా ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమ పథకాలే. సేవకుడిగా, మీ ఇంటి బిడ్డగా గడప గడపకు వెళ్లి మీ సమస్యలు తెలుసుకున్నాను,ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవడానికి కట్టుబడి ఉన్నాను. మేమిచ్చిన హామీలు అభివృద్ధిగా మారాలి —— కొత్త పెన్షన్లు, మౌలిక వసతులు, ప్రజల సంక్షేమం అన్నింటిలో మీ బిడ్డగా, మీ సేవకుడిగా మీతోనే ఉంటాను. నా మీద నమ్మకంతో మీరు వేసే ప్రతి ఓటు ఆలేరు అభివృద్ధికి పునాది అవుతుంది.

ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందిస్తాం

❖ కొత్తగూడెం టూ టౌన్ సిఐ ప్రతాప్

దశ, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెంలోని త్రీ ఇంక్లైన్, ధన్బాద్ గ్రామ పంచాయతీలకు చెందిన క్రీడాకారులు లికిత్ చరణ్, సాయి శృతి, శరణ్యలు రాష్ట్రస్థాయి సీఎం కప్ రెజ్లింగ్ ఛాంపియన్షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల కొత్తగూడెంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన సీఎం కప్ జిల్లా స్థాయి రెజ్లింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో పలు విభాగాలలో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచిన లిఖిత్ చరణ్ 48 కేజీల విభాగంలో స్వర్ణ పతకం, సాయి శృతి 62 కేజీల విభాగంలో స్వర్ణ పతకం, శరణ్య 46 కేజీల విభాగంలో స్వర్ణ పతకం గెలుపొందడం ద్వారా జిల్లా జట్టులో స్థానం పొంది రాష్ట్రస్థాయి పోటీలకు వీరు అర్హత సాధించారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను శనివారం కొత్తగూడెం టూ టౌన్ సిఐ ప్రతాప్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలలో సైతం మంచి ప్రతిభ కనబరిచి పతకాలు గెలుపొంది మన జిల్లా కీర్తిని చాటాలని ప్రతి ఒక్కరు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలని ప్రతిభవంతులైన క్రీడాకారులకు తమ వంతు ప్రోత్సాహాన్ని ఎల్లప్పుడూ అందిస్తామని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కాశీ హుస్సేన్, ఉపాధ్యక్షులు ఆదినారాయణ, రెజ్లింగ్ జాతీయ క్రీడాకారిణి నిహారిక తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి చైర్మన్ కు సన్మానం

దశ, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి భవన్ లో శనివారం సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్ కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీలు కందికట్ల వీరభద్రయ్య, వైవి రావు, ముస్కే సమ్మయ్య, మడ్డి ఎల్లయ్య, షేక్ బాజీ, సైదా తదితరులు పాల్గొన్నారు.

ఆరు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ విజయ ఢంకా

దశ, యాదగిరిగుట్ట : యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆరు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ విజయ డంకా మోగించిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ బండ్రు శోభారాణితో కలిసి మీడియా సమావేశం శనివారం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మరింత చేరువైందన్నారు. జిల్లాలోని అన్ని చైర్మన్ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఇందుకు నిదర్శనమన్నారు. గత సర్పంచ్ ఎన్నికల్లో కూడా జిల్లాలో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ గెలుచుకున్న విషయాన్ని గుర్తుచేశారు. రాబోయే జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో కూడా ఇదే ఫలితాలు పునరావృతం అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఆలేరు మున్సిపాలిటీలో 54 శాతం ఓట్లు కాంగ్రెస్‌కు రావగా, బీఆర్ఎస్‌కు 34 శాతం మాత్రమే వచ్చినట్లు చెప్పారు. 20 శాతం ఓట్ల ఆధిక్యం ద్వారా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసం ఉంచినట్లు స్పష్టమైందన్నారు. ఆలేరు కాంగ్రెస్‌ను ఓడించేందుకు మాజీ ఎమ్మెల్యేలు పలు కుయుక్తులు పన్నినా ప్రజలు వారిని మూడు సీట్లకే పరిమితం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ క్లీన్ స్వీప్ చేస్తుందన్న ప్రచారం వాస్తవం కాలేదన్నారు. యాదగిరిగుట్ట, ఆలేరు ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అజ్ఞానపు చీకట్లను తొలగించేది విజ్ఞానం

❖ మండల విద్యాధికారి కృష్ణ హారి

❖ ఘనంగా విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం ప్రీ ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవం.

❖ పుల్వామా ఘటనలో చనిపోయిన జవాన్ లకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

దశ, ఎల్లారెడ్డిపేట: అజ్ఞానమనే చీకట్లను తొలగించేది విజ్ఞానమని అట్టి విజ్ఞానం విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం లో అందుతుందని ఎల్లారెడ్డిపేట మండల విద్యాధికారి కృష్ణ హరి అన్నారు. శనివారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం లో ప్రీ ప్రైమరీ, ప్రైమరీ స్కూల్ 28 వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. కార్యక్రమానికి ముందు పూల్వామా ఘటనలో చనిపోయిన జవాన్ లకు రెండు నిమిషాల పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు మౌనం పాటించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి కృష్ణహారి హాజరై మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ, ప్రైమరీ స్థాయిలో విద్యార్థులు ఇంత చక్కని కళా ప్రదర్శన చేయడం హర్షించదగినదని అన్నారు. వేదిక మీద ఎలాంటి అణుకువ లేకుండా నృత్యాలు చేయడం చాలా అభినందనీయమన్నారు. చిన్నపిల్లలకు అన్నం తిన పెట్టే రాత్రి సమయంలో సెల్ ఫోన్లు ఇవ్వకూడదని వారికి అరుభయట ప్రకృతి అందాలను సూర్య చంద్రులను నక్షంత్ర సముహం గురించి తెలియజేయాలని అలా చేయడం వల్ల పిల్లలు ప్రకృతిని ఆస్వాదిస్తారన్నారు.చిన్నపిల్లలకు సెల్ ఫోన్లు ఇవ్వడం వల్ల మేధస్సు తగ్గడంతో పాటు అనేక ఆనార్థాలకు గురి అవుతున్నారని ఆనారోగ్యం బారీనపడుతున్నారన్నారు. అదేవిధంగా కుటుంబ సభ్యులు పిల్లలతో కలిసి ప్రతి నిత్యం సామూహిక భోజనాలు చేయడం వల్ల కుటుంబ జీవన విధానం అలవడుతుందని కుటుంబ జీవనం మెరుగుపడుతుందన్నారు.

అనంతరం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి బాల్ రెడ్డి, మాజీ ఎంపిటిసి ఒగ్గు బాలరాజు యాదవ్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కుబేర స్వామి మాట్లాడుతూ విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కార్పోరేట్ స్కూల్స్ కు ధీటుగా గ్రామీణ ప్రాంతంలో ఉన్నత విద్యను అందిస్తుందన్నారు. విద్యార్థులను వివిధ పోటీ పరీక్షలకు ఉత్తమ విద్యార్థులుగా క్రీడాకారులుగా తీర్చిదిద్దుతుందని వారు కొనియాడారు.

ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు వివిధ ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగ రంగాలలో స్థిరపడ్డారని వారు గుర్తు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా ప్రీ ప్రైమరీ,ప్రైమరీ తరగతులకు చెందిన విద్యార్థులు చేసిన నృత్యాలు వార్షికోత్సవ వేడుకలకు హాజరైన వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం లతీఫ్, నహిమ,పాఠశాల ప్రిన్సిపాల్ శరత్, సంతోష్,లీనా తోపాటు పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా.. ఇదేనా ప్రజాపాలన

❖ టిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్

దశ, రాజన్న సిరిసిల్ల : సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జక్కల్ శివారులోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో భోజనం సరిగా లేదని విద్యార్థులు రోడ్డుమీదకు వచ్చి ఆందోళన వ్యక్తం చేసిన ఘటనపై కంచర్ల రవి గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సిరిసిల్ల తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు.విద్యార్థులు ఎంత ఆందోళన చేసినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టే లేదని దుయ్యబట్టారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసిఆర్ నాయకత్వంలో గురుకులాలను దేశంలోనే నెంబర్ వన్ స్థాయికి తీసుకెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు.కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్దే ఉంచుకుని కూడా విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రంలో గురుకులాలు, పాఠశాలల్లో విద్యార్థులు తరచూ ఆందోళన చేయాల్సి వస్తోందని పేర్కొంటూ, "విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నరని ఇదేనా ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలన?" అని సూటిగా ప్రశ్నించారు.పాఠశాలలో చదువుకోవాల్సిన విద్యార్థులను రోడ్డుమీదకు తీసుకొచ్చిన ఘనత ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని మండిపడ్డారు.

ఇన్ని సంఘటనలు జరిగినా రాష్ట్ర ముఖ్యమంత్రి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం కూడా నిర్వహించకపోవడం బాధాకరమని అన్నారు. విద్యార్థులందరికీ అండగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ విద్యార్థులకు అన్యాయం జరిగినా పార్టీ అండగా ఉంటుందని కంచర్ల రవి గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అరెల్లి వినయ్ కుమార్, కె విష్ణు, కె సిద్ధార్థ, కె మణి శర్మ, కె జశ్వంత్, సాయి తేజ కె, కే వర్షిత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శివ నామ స్మరణతో మారు మ్రోగనున్న శివాలయాలు

దశ, వరంగల్: హిందువుల ముఖ్యమైన పండుగ అయిన మహా శివరాత్రిని ప్రతి సంవత్సరం జరుపుకుంటారు. ఈ నెల 15 వ తేదీన శివరాత్రి జరుపుకుంటున్నాము. ఈ పండుగను "శివుని మహా రాత్రి" అని కూడా అంటారు. మహా శివరాత్రి, శివుని ఆశీస్సులు పొందడానికి ఒక పవిత్రమైన వేడుక. శివుని శక్తులు అత్యంత చురుగ్గా ఉండే రాత్రి ఇది. ఈ రోజున భక్తులు శివుడిని స్వచ్ఛమైన మనస్సుతో పూజిస్తారు. 2026 మహా శివరాత్రి పండుగ ఆదివారం ఫిబ్రవరి 15 న జరుపుకుంటారు. మహా శివరాత్రి పండుగ గురించి ముఖ్యమైన విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం..

మహా శివరాత్రి ప్రాముఖ్యత

హిందూ మతంలో మహా శివరాత్రి అతి ముఖ్యమైన పండుగలలో ఒకటి. దీనిని శివుడు, పార్వతి గౌరవార్థం జరుపుకుంటారు. పౌరాణిక కథల ప్రకారం, శివుడు, పార్వతి ఈ రోజున ఏకమయ్యారని చెబుతారు. వారి కలయిక పురుష, స్త్రీ శక్తుల మధ్య సామరస్యాన్ని సూచిస్తుంది. ఈ పండుగ స్వీయ నియంత్రణ, ఆత్మపరిశీలన, ఆధ్యాత్మిక మేల్కొలుపు వంటి వివిధ విషయాలను బోధిస్తుంది. మహా శివరాత్రి పండుగ ప్రజలను పునర్జన్మను స్వీకరించడానికి, ప్రతికూలతను విడిచిపెట్టడానికి ప్రోత్సహిస్తుంది.

మహా శివరాత్రి పూజా విధానం

ఈ రోజున భక్తులు ఉదయాన్నే నిద్రలేచి స్నానం చేసి, తమను తాము శుభ్రపరచుకుని, శుభ్రమైన బట్టలు ధరించాలి.ఇంట్లో దేవుని గదిలో శివుని విగ్రహం, శివలింగం లేదా ఫోటోను ప్రతిష్టించాలి. తేనె, పాలు, నీళ్లు, తమలపాకులు నైవేద్యం పెట్టండి.మీరు ఇంట్లో శివుడిని పూజించలేకపోతే, సమీపంలోని శివాలయాలను సందర్శించి శివుడిని పూజించాలి.ఈ రోజంతా శివ నామ, శివ స్తోత్ర, ఓం నమః శివాయ మంత్రాలు, ఇతర శివ మంత్రాలను జపించాలి.

భక్తులు శివ పూజ చేసే ముందు లేదా ఆలయాన్ని సందర్శించే ముందు స్నానం చేయాలి. పూజ సాధారణంగా రాత్రిపూట జరుగుతుంది.ఈ రోజు ఉపవాసం పాటించేవారు మరుసటి రోజు ఉదయం స్నానం చేసిన తర్వాత ఉపవాసం ముగించుకుంటారు. భక్తులు సూర్యోదయం మధ్య చతుర్దశి తిథి ముగిసేలోపు తమ ఉపవాసాన్ని ముగించాలి.భక్తులు రాత్రికి ఒకటి లేదా నాలుగు సార్లు శివరాత్రి పూజ చేయవచ్చు. రాత్రిని నాలుగు ప్రహారాలుగా విభజించి నాలుగు సార్లు పూజ చేయవచ్చు.

"మహా శివరాత్రి నాడు ఉపవాసం ఎలా ఆచరించాలి?"

నీరు లేకుండా ఉపవాసం ఉండటం లేదా పండ్లు తినడం లేదా రోజంతా సాత్విక ఆహారం తీసుకోవడం ద్వారా ఉపవాసం చేయవచ్చు. అయితే, నిర్జల ఉపవాసానికి ఎక్కువ ప్రాముఖ్యత ఉంది. శివాలయాలను సందర్శించి రుద్రాభిషేకం చేయండి శివ మంత్రాలను పఠించండి. "ఓం నమః శివాయ" జపించండి. రాత్రి జాగరణ చేసి 4 సార్లు శివ పూజ చేయండి. మరుసటి రోజు ఉదయం ప్రార్థన చేసిన తర్వాత ఉపవాసం ముగించండి.

"మహా శివరాత్రి చరిత్ర"

మహా శివరాత్రి పండుగకు సంబంధించిన అనేక ఇతిహాసాలు, పురాణాలు, కథలు ఉన్నాయి. మహా శివరాత్రి పండుగ శివుడు, పార్వతి దేవి వివాహం జరిగిన పవిత్ర రాత్రిని సూచిస్తుంది. చాలా సంవత్సరాలు ధ్యానం, తపస్సు చేసిన తరువాత, మహా శివరాత్రి రోజున, శివుడు పార్వతిని తన దైవిక భార్యగా స్వీకరించాడు.మరొక కథ ప్రకారం, శివుడు తాండవ నృత్యం చేసిన రాత్రి ఇది. ఈ రాత్రి శివుడు తాండవ నృత్యాన్ని ప్రదర్శించాడని నమ్ముతారు. అందువల్ల, భక్తులు రాత్రంతా ప్రార్థనలు, పూజలు, మంత్రాలు జపిస్తూ శివుడిని పూజిస్తారు. మహా శివరాత్రికి సంబంధించిన మరొక కథ ప్రకారం, ఈ రోజున, శివుడు సముద్ర మథనం నుండి వచ్చిన హాలాహల విషాన్ని సేవించాడు.

ఈ విషం మొత్తం విశ్వాన్నే నాశనం చేసే శక్తిని కలిగి ఉంది. శివుడు ఆ విషాన్ని స్వయంగా సేవించి విశ్వాన్ని రక్షించాడని 'నీలకంఠ' అని పిలుస్తారు. దేశంలో అనేక శివాలయాలు వున్నాయి వివిధ ఆధ్యాత్మిక సంస్థలు పెద్ద ఎత్తున మహా శివరాత్రి ని నిర్వహన చేస్తాయి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులని భక్తి మార్గం వైపు వెళ్ళేలా చేస్తారు భజనలు ప్రవచనాలు భక్తి పాటలు నృత్యాల లాంటివి ఏర్పాటు చేసి శివోహం అనే నాదాన్ని విశ్వ వ్యాప్తం చేశారు.

వ్యక్తిత్వ వికాసంతో సంతోషకరమైన జీవితం

- నిరంతర సాధన, కృషి విజయ రహస్యాలు
- కేజీబీవీ నడిగూడెం లో వ్యక్తిత్వ వికాస పాఠాలు

దశ, నడిగూడెం : ప్రతి ఒక్కరూ వ్యక్తిత్వ వికాసంతో సంతోషకరమైన జీవితం గడపవచ్చని ప్రధాన వక్త ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు విజయీభవ సంస్థ వ్యవస్థాపకులు ఉపాధ్యాయులు చారుగుండ్ల రాజశేఖర్ తెలిపారు. కేజీబీవీ నడిగూడెం వ్యక్తిత్వ వికాస శిక్షణా కార్యక్రమం లో మాట్లాడుతూ వివిధ సమయాలలో పని ఒత్తిడికి గురి అవుతుంటారని, ఆ ఒత్తిడిని తగ్గించేందుకు పదవ తరగతి పరీక్షల్లో విజయం ఎలా సాధించాలో వాటి సోపానాలు వివరించారు. భయం వీడితే విజయం మీదే అని చెబుతూ సమయపాలన, ఆత్మవిశ్వాసం, అపజయాలు విజయానికి మార్గాలు, స్ఫూర్తి నింపే విజయాగాథలు, ఓపిక, మానసిక ఏకగ్రత మీద వర్కుషాపు నిర్వహించారు, సోషల్ మీడియా దుష్ప్రచారాలు, జీవన నైపుణ్యాలు మీద శిక్షణ ఇవ్వటం జరిగింది. అభిరుచి పరీక్ష నిర్వహించి విద్యార్థులకి ప్రశంసా పత్రాలు అందజేశారు కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ వెంకటరమణ ఎస్ ఐ అజయ్ కుమార్ రైటర్డ్ ప్రధానోపాధ్యాయులు బొగ్గారాపు రామమూర్తి ఉపాధ్యాయులు సునీత తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణి

దశ, ఓయూ: ఫ్రాన్సేలియన్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో దాదాపు 120 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ మేరకు శనివారం శాంతినగర్లో జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఫాదర్ సురేష్బాబు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న పేద, మధ్యతరగతికి చెందిన మహిళలకు ఉచితంగానే టైలరింగ్ శిక్షణ ఇప్పించామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి దానికి సంబంధించిన సర్టిఫికేట్లు, కుట్టు మిషన్లు అందజేశామనీ పేర్కొన్నారు. గృహిణులుగా ఉంటూనే వారు తమ స్వశక్తితో ఎదగడానికి టైలరింగ్ ద్వారా ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ డైరెక్టర్ ఫాదర్ నాగోతు రవి ప్రశాంత్, సందీప్, క్రీస్తురాజ్, జడ్డూ జోసెఫ్, అనిల్ కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ టోర్నమెంట్ల విజేతలకు ఘన సన్మానం

దశ, ఓయూ: ప్రొ జయశంకర్ స్టేడియం వెటరన్స్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ జాతీయ స్థాయి టీటీ టోర్నమెంట్లలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. ఈ మేరకు శనివారం లాలాపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఇటీవల భువనేశ్వర్ లో జరిగిన ఆల్ ఇండియా మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్, చెన్నైలో జరిగిన పారా నేషనల్ ర్యాకింగ్ టోర్నమెంట్లో లాలాపేటకు చెందిన వెటరన్ టేబుల్ టెన్నిస్ సభ్యులు మహిళా సింగల్స్, డబుల్స్ 59 విభాగంలో ఇసా సుకన్య, మంతు మూర్మ రన్నర్స్ గా నిలిచారు. మిక్స్డ్ డబుల్స్ 59 విభాగంలో ఎండి అబ్బాస్, ఇసా సుకన్య రన్నర్స్ గా నిలిచారు. తాహెర్, ఎండి అబ్బాస్,హరికృష్ణ. ఇ.ఎస్. జ్ఞానేశ్వర్ విజేతలుగా, రన్నర్స్ గా ప్రతిభ చాటారు. పారా నేషనల్ ర్యాంకింగ్ టీటీ చాంపియన్ షిప్202526 నిషా కుమారి రజత పతకాన్ని గెలుచుకున్నారు. దీంతో పాటుగా 10 రోజుల వ్యవధిలో 1600 కిలో మీటర్ల దూరం కన్యాకుమారికి సైక్లింగ్ ప్రయాణాన్ని పూర్తి చేసిన టేబుల్ టెన్నిస్ ఆటగాడు వై. రాజేంద్ర ప్రసాద్ తదితరులను అసోసియేషన్ సభ్యులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయిలో పతకాలు, అవార్డులు సాధించి లాలాపేట విట్ట పేరును మరింత ఇనుమడింపజేశారనీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రసిడెంట్ దయాకర్ కుసుమ, సెక్రటరీ బేతి విఠల్, వైస్ ప్రసిడెంట్ కె. హరినాథబాబు, కట్ట శ్రీనివాసరావు, ట్రెజరర్ ఎస్. మురళి, మెంబర్స్ ఎంబిఎన్. కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎం హాస్పిటల్లో దారుణం

- మృతదేహాన్ని చేతులపై మోసుకెళ్లిన కుటుంబ సభ్యులు
- స్ట్రెచర్ కూడా ఇవ్వలేని సంఘటన..
- ఆస్పత్రి సిబ్బంది, డాక్టర్లు అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు

దశ, వరంగల్: పేదల ఆసరాగా భావించే వరంగల్ నగరంలోని (ఎంజీఎం)లో మానవత్వం మరిచిన ఘటన వెలుగుచూసింది. నిన్న సాయంత్రం మృతి చెందిన రోగి మృతదేహాన్ని బయటకు తరలించేందుకు ఆస్పత్రి సిబ్బంది సహకరించలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. కనీసం స్ట్రెచర్ కూడా ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

దీంతో చేసేదేమీ లేక, కన్నీళ్లు మున్నీరుగా కుటుంబ సభ్యులే మృతదేహాన్ని చేతుల మీదుగా మోసుకుంటూ అంబులెన్స్ వరకు తీసుకెళ్లాల్సి వచ్చింది. ఈ దృశ్యం అక్కడున్న వారిని కలచివేసింది. పేదల కోసం ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయనే నమ్మకానికి ఈ ఘటన గట్టి దెబ్బ తగిలిందని స్థానికులు మండిపడుతున్నారు.

"పేదల కోసం అన్ని సదుపాయాలు ఉన్నాయని చెబుతారు... కానీ అవసరమైన సమయంలో కనీస మానవత్వం కూడా కనిపించడంలేదు" అంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పాలన ప్రజల కోసమేనని చెప్పుకుంటూ వచ్చే ప్రభుత్వాలు, వ్యవస్థలు — సాధారణ ప్రజలకు మాత్రం పూర్తి స్థాయి సదుపాయాలు అందించడంలో విఫలమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. చదువుకున్న అధికారులు తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తే ఇలాంటి ఘటనలు చోటుచేసుకునేవి కావని సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

రాజకీయ నాయకులకు అయ్యే ఖర్చులు పెరుగుతున్నా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం సమాజం ఎటు దిశగా వెళ్తుందనే ప్రశ్నలను రేకెత్తిస్తోంది. ఈ ఘటనపై వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పేదల ఆసుపత్రిలో స్ట్రెచర్ కూడా దొరకకపోతే.. ప్రజలు నమ్మకం పెట్టుకోవాల్సింది ఎవరిపైన అనే సందేహాలు కలుగుతున్నాయి.వైద్యం వ్యాపారమేన మనిషి చనిపోతే ఇతర జీవాల కన్నా అద్వాన్నమేనా...

వెన్నం శ్రీకాంత్ రెడ్డి, విజయ్ కాంత్ రెడ్డిలను పరామర్శించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

దశ, మహబూబాబాద్: మాజీ TPCC రాష్ట్ర కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, బిగ్ టీవీ న్యూస్ ఛానల్ చైర్మన్ వెన్నం విజయ కాంత్ రెడ్డి తండ్రి వెన్నం రాఘవేంద్రరెడ్డి ఇటీవల మరణించగా మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండలంలోని వారి స్వగ్రామం అయిన రెడ్యాల గ్రామానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెళ్లి ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వెన్నం రాఘవేంద్ర రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకాశవాణిలో ఘనంగా "రేడియో కిసాన్ దివాస్"

- వ్యవసాయంతో అధిక లాభాలు
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు

దశ, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం రేడియో స్టేషన్లో శనివారం 'రేడియో కిసాన్ దివాస్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలిత రేడియో కేంద్రం ప్రాంగణంలో పలు ఔషధ, పూల మొక్కలతో ఏర్పాటు చేసిన "ప్రకృతి మాత గ్రీన్ గార్డెన్ " ను స్టేషన్ ప్రోగ్రామ్ హెడ్ కొలిపాక శంకరరావు ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బాబురావు, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టీ.భరత్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ అహ్మద్, రామవరం పశు వైద్యులు డాక్టర్ జి.ఆనందరావు, పలువురు ఆదర్శ, అభ్యుదయ రైతులు పాల్గొని మాట్లాడారు.

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే సమీకృత వ్యవసాయం ద్వారా సాధ్యమవుతుందన్నారు. పంటలతో పాటుగా చేపలు, కోళ్లు, మేకలు ఇతర పంటలతో వ్యవసాయం చేస్తే రైతుకు ఎంతో లాభామని తెలిపారు. రైతులను చైతన్య వంతులు చేసేందుకు రేడియో ద్వారా ప్రసారం చేస్తున్న వ్యవసాయ కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగ పడుతున్నాయన్నారు. అనేక సంవత్సరాలుగా రేడియో ద్వారా రైతులకు అందిస్తున్న వ్యవసాయ కార్యక్రమాల ద్వారా రైతుల్లో ఆసక్తిని చైతన్యాన్ని కలిగిస్తున్న ఆకాశవాణికి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని రైతు ఉపయోగ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

కిసాన్ దివాస్ పురస్కరించుకొని పలువురు అభ్యుదయ రైతులను, అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ రైతు గొట్టిపాటి వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, క్రీస్తు రాజు, సందీప్, హనుమా, మొక్కల పెంపకం దారులు నూర్వి రాజశేఖర్, రామంచి శ్రీనివాస్, రేడియో స్టేషన్ ఇంజనీరింగ్ సిబ్బంది బాబు సింగ్, సుమన్, ఆనంద్, కోటేశ్వరరావు, రేడియో జాకీలు తదితరులు పాల్గొన్నారు.

కోటమర్తి వాసికి సామాజిక సేవా రంగంలో 'గౌరవ డాక్టరేట్'

- చెన్నైలోని భారతీయ విద్యాభవన్‌లో ఘనంగా ప్రధానోత్సవం

దశ, అడ్డగూడూర్: గత మూడు దశాబ్దాలుగా నిరంతర సామాజిక సేవలో నిమగ్నమై, సమాజ మార్పు కోసం కృషి చేస్తున్న కోటమర్తి వాసికి చామల బిక్షం రెడ్డికి అంతర్జాతీయ స్థాయి పురస్కారం వరించింది. సామాజిక సేవా రంగంలో ఆయన చేసిన విశేష కృషిని గుర్తిస్తూ అమెరికాకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు ఆయనకు 'గౌరవ డాక్టరేట్' ప్రదానం చేశారు. తమిళనాడు రాజధాని చెన్నైలోని భారతీయ విద్యాభవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు ఈ పురస్కారాన్ని అందజేశారు.

ముప్పై ఏళ్ల నిరంతర సేవ సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ సోషల్ సర్వీస్ (SISS) అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి గత 30 ఏళ్లుగా ప్రజల భాగస్వామ్యంతో అనేక సామాజిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఆయన సేవల్లో జల సంరక్షణ ద్వారా భూగర్భ జల మట్టాలను పెంచేందుకు ఊట చెరువులు, చెక్ డ్యాముల నిర్మాణం చేపట్టారు.రైతు చైతన్యం ద్వారా భూసార పరిరక్షణపై రైతులకు మెళకువలు నేర్పడమే కాకుండా, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై శిక్షణనిచ్చి రసాయన రహిత సాగును ప్రోత్సహించారు.మహిళా సాధికారత కోసం మహిళా సంఘాలను స్థాపించి, వారికి స్వయం ఉపాధి శిక్షణ ఇచ్చి సుస్థిర జీవనోపాధి కల్పించారు. బాలల హక్కుల కోసం బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించడమే కాకుండా, నల్లగొండ జిల్లా బాలల సంక్షేమ కమిటీ (CWC) సభ్యునిగా ఏడేళ్ల పాటు సేవలందించారు.

మెరీడియన్ స్కూల్ నూతన బ్రాంచ్ ప్రారంభించిన కూడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి

దశ, పరకాల: ఆరేపల్లి లో మెరీడియన్ స్కూల్ నూతన బ్రాంచ్ ని ఆవిష్కరించడానికి స్కూల్ చైర్ పర్సన్ శ్రీమతి మాధురి పెసరు ఆహ్వానం మేరకు కూడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి ఘనంగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్కూల్ కి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉన్నతమైన ప్రమాణాలతో, విద్యార్థులు సర్వోతో ముఖాభివృద్ధికి తోడ్పడుతూ, మరెందరో విద్యార్థులకు న్యాయమైన విద్యను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కార్పొరేటర్ జన్ను శిబారాణి అనిల్ ఉపాధ్యాలు పాల్గొనారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com